క్లుప్తంగా

నేటి నుంచి 144 సెక్షన్



నకరికల్లు: ఈ నెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్‌ఐ పైడి రాంబాబు శుక్రవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కారణంగా జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం నుంచి 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. అన్నిరకాల దుకాణాలు మూసి వేయాల్సి ఉంటుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి నిత్యావసర వస్తువులను నాలుగురోజులకు సరిపడా ముందుగానే తెచ్చుకోవాలని సూచించారు. నలుగురు అంతకన్నా ఎక్కువ మంది రోడ్లపై గుమికూడరాదని హెచ్చరించారు. అనవసరపు గొడవలు, ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదకూరపాడు(అమరావతి): విద్యుత్ లైన్‌ల మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ కారణంగా శనివారం మండల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

ఉచితంగా భూసార పరీక్షలు



నకరికల్లు: వ్యవసాయ భూముల్లోని సూక్ష్మపోషకాల స్థాయిని గుర్తించేందుకు ఉచితంగా భూసార పరీక్షలు చేపట్టనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు శుక్రవారం తెలిపారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో మట్టి నమూనాలు సేకరిస్తామన్నారు. భూసార పరీక్షల ద్వారా రైతులు సాగుచేసే పంటలకు సూక్ష్మ, స్థూలపోషకాల లభ్యత, సేంద్రియ పదార్థం లభ్యత, నేల ఉదజని సూచికతో పాటు వివిధ పంటల సాగుకు వేయాల్సిన ఎరువులు సూచించవచ్చన్నారు. ఉచితంగా అందజేసే సేవను రైతులు సద్వినియోగం చేసుకొని నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కోటేశ్వరమ్మ



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉపసర్తి కోటేశ్వరమ్మను నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన జెడ్‌ఎస్ రామచంద్రరావు శుక్రవారం పదవీవిరమణ చేశారు. దీంతో సీనియర్ ఫిజిక్స్ అధ్యాపకురాలైన ఉపసర్తి కోటేశ్వరమ్మకు ప్రిన్సిపాల్‌గా అవకాశం కల్పించారు. శనివారం ఆమె ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు శుక్రవారం ఆమెకు అభినందనలు తెలిపారు.

బంగారు గొలుసు అపహరణ

నకరికల్లు: పొలంలో పనిచేసుకుంటున్న మహిళ మెడలోని బంగారు గొలుసు గుర్తు తెలియని దుండగుడు అపహరించాడు. ఈ ఘటన మండలంలోని నర్సింగపాడు గ్రామంలో శుక్రవారం జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాదం రమణమ్మ అనే మహిళ సాయంత్రం పొలంలో గడ్డి కోసుకుంటుంది. గుర్తు తెలియని యువకుడు ఆమె వద్దకు వచ్చి కత్తితో బెదిరించి మెడలోని 3.5 సవర్ల బంగారు నాంతాడును లాక్కున్నాడు. రోడ్డుపై మరొక వ్యక్తి ద్విచక్ర వాహనంపై సిద్ధంగా ఉండగా ఇద్దరూ కలిసి పరారయ్యారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.రాంబాబు తెలిపారు.

గ్రామాలలో హింసాత్మక ఘటనలకు తావులేదు

డీఎస్పీ వెంకటేశ్వర్లు

రెంటచింతల: సార్వత్రిక ఎన్నికల ఫలితాల సమయంలో గ్రామాలలో హింసాత్మక ఘటనలకు తావు లేదని ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి అల్లర్లకు దూరంగా ఉండి పోలీసులకు పూర్తిగా సహకరించాలని.. ప్రజల్లో పోలీసుల పట్ల విశ్వాసం కల్పించేందుకే కవాతు (ఫ్లాగ్ మార్చ్) నిర్వహిస్తున్నామని డీఎస్పీ పి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో 80 మంది ప్రత్యేక దళాలు, ఏఆర్ పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలకు భరోసా కల్పించేందుకు, మనో ధైర్యం కల్పించడానికి, ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా సమస్యాత్మక గ్రామాలలో ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల ఫలితాల సమయంలో బాణసంచా కాల్చరాదని.. ఎలాంటి ఉత్సవాలు జరపరాదన్నారు. గ్రామాలలో ప్రశాంత వాతావరణం నెలకొనడానికి ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక పనులకు పాల్పడేవారిపై రౌడీ షీట్ ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

20 రౌండ్లలో సత్తెనపల్లి ఫలితం

- కౌంటింగ్ కేంద్రంలో ఒక్కో రౌండ్‌కు 14 టేబుళ్లు
- ఒక గదిలో ఎమ్మెల్యే, మరో గదిలో ఎంపీ ఓట్ల లెక్కింపు
- కౌంటింగ్ ఏర్పాట్లలో యంత్రాంగం తలమునకలు



దమ్మాలపాడులో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

సత్తెనపల్లి/ముప్పాళ్ల: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు గడువు దగ్గర పడింది. త్వరలోనే ఈవీఎంలలో దాగున్న అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. జూన్ 4న నరసరావుపేట సమీపంలోని కాకాని జేఎన్‌టీయూలో సత్తెనపల్లి నియోజకవర్గానికి సంబంధించిన అసెంబ్లీ, పార్లమెంట్ ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అసెంబ్లీ ఓట్ల లెక్కింపు ఒక గదిలో, పార్లమెంట్ ఓట్ల లెక్కింపు మరో గదిలో చేపడుతున్నారు. ఒక్కొక్క గదిలో 14 టేబుళ్లు అసెంబ్లీకి, 14 టేబుళ్లు పార్లమెంటుకు ఏర్పాటు చేశారు.

- నియోజకవర్గంలో మొత్తం 274 పోలింగ్ కేంద్రాల్లో 2,10,500 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. చెదురు మదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ ముగిసింది. అన్ని మండలాల్లోను మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. 86.97 శాతం పోలింగ్ నమోదైంది. వీరు కాక దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన వృద్ధులు 255 మంది హోమ్ ఓటింగ్ ద్వారా.. ఎన్నికల విధులకు సంబంధించిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 1,926 మంది, ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా 288 మంది.. 281 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. జూన్ 4వ తేదీ ఉదయం 7.59 గంటల వరకు వచ్చిన ఓట్లను పరిగణనలోకి తీసుకుంటారు. సర్వీస్ ఓట్లు రావాల్సి ఉంది.

కట్టావారిపాలెంతో ఆరంభం...

నియోజకవర్గంలోని మొదటి పోలింగ్ కేంద్రమైన సత్తెనపల్లి మండలంలోని కట్టావారిపాలెం గ్రామం నుంచి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఉదయం 8 గంటలకు పోస్టల్ ఓట్లతో లెక్కింపు ప్రారంభిస్తారు. ఒక్కో రౌండ్‌కు 14 టేబుళ్ల చొప్పున 20 రౌండ్లలో ఫలితం తేలనుంది. అయితే చివరి రౌండ్‌లో 6 టేబుళ్లు ఖాళీగా ఉండనున్నాయి.

- సత్తెనపల్లి మండలంలోని 1వ పోలింగ్ కేంద్రమైన కట్టావారిపాలెం నుంచి ప్రారంభమై 119 పోలింగ్ కేంద్రమైన ధూళిపాళ్ళ గ్రామంతో సత్తెనపల్లి మండలం, మున్సిపాలిటీ కౌంటింగ్ ముగుస్తుంది.
- రాజుపాలెం మండలంలోని 120వ పోలింగ్ కేంద్రమైన రెడ్డిగూడెం నుంచి ప్రారంభమై 166వ పోలింగ్ కేంద్రమైన ఇనిమెట్ల గ్రామంతో ముగుస్తుంది.
- నకరికల్లు మండలంలోని 167వ పోలింగ్ కేంద్రమైన త్రిపురాపురం గ్రామం నుంచి ప్రారంభమై 229వ పోలింగ్ కేంద్రమైన చేజర్ల గ్రామంతో ముగుస్తుంది.
- ముప్పాళ్ల మండలంలోని 230వ పోలింగ్ కేంద్రమైన కుందురువారిపాలెం గ్రామం నుంచి మొదలై 273వ పోలింగ్ కేంద్రమైన ఇరుకుపాలెం గ్రామంతో ముగుస్తుంది. చిట్టచివరిగా సత్తెనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఇటీవలే నూతనంగా ఏర్పడిన 274 పోలింగ్ కేంద్రమైన రంగాకాలనీ ఈవీఎం లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియ ముగుస్తుంది. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా అవసరమైన కౌంటింగ్ ఏజెంట్ల నియామకాల ప్రక్రియ తుది దశకు చేరుకుంది.

రౌండ్‌ల వారీగా ఇలా...

- మొదటి రౌండ్‌లో.. కట్టావారిపాలెం, కంటేపూడి, కొమెరపూడి, నందిగామ
- రెండో రౌండ్‌లో.. నందిగామ, రామకృష్ణాపురం, గుడిపూడి, లక్ష్మీపురం, పెదమక్కెన, గర్నెపూడి, లక్కరాజుగార్లపాడు
- మూడో రౌండ్‌లో.. లక్కరాజుగార్లపాడు, సత్తెనపల్లి టౌన్
- నాలుగు, ఐదు రౌండ్‌లలో.. సత్తెనపల్లి టౌన్
- ఆరో రౌండ్‌లో.. సత్తెనపల్లి టౌన్, గండ్లూరు, భీమవరం, అబ్బూరు, దీపాలదిన్నెపాలెం, పణిదం
- ఏడో రౌండ్‌లో.. పణిదం, గుజ్జర్లపూడి, భట్లూరు, కట్టమూరు, గోరంట్ల, రెంటపాళ్ల
- ఎనిమిదవ రౌండ్‌లో.. రెంటపాళ్ల, గోగులపాడు, పాకాలపాడు, కంకణాలపల్లి, వెన్నాదేవి, బృగుబండ
- తొమ్మిదవ రౌండ్‌లో.. బృగుబండ, ధూళిపాళ్ల, రాజుపాలెం మండలం రెడ్డిగూడెం, మొక్కపాడు, బ్రాహ్మణ పల్లి
- పదవ రౌండ్‌లో.. రాజుపాలెం, చౌటపాపాయపాలెం ఆర్‌ఆర్ సెంటర్, చౌటపాపాయపాలెం, రాజుపాలెం ఆర్‌ఆర్ సెంటర్, కుబాదుపురం, అంచులవారిపాలెం
- 11వ రౌండ్‌లో.. కుబాద్‌పురం శివారు కోట నెమలిపురి, పార్వతీపురం, దేవరంపాడు, నెమలిపురి, శ్రీనివాసనగర్, గణపవరం
- 12వ రౌండ్‌లో.. గణపవరం, బీరవల్లిపాయ, బలిజే పల్లి, ఉప్పలపాడు, చల్లపల్లితండా, ఇనిమెట్ల, త్రిపురాపురం, గుండ్లపల్లి
- 13వ రౌండ్‌లో.. గుండ్లపల్లి, బాలాజీ నగర్ తండా, నరసింగపాడు, నకరికల్లు
- 14వ రౌండ్‌లో.. నకరికల్లు, శివాపురం తండా, చల్ల గుండ్ల
- 15వ రౌండ్‌లో.. చీమలమర్రి, చాగల్లు, కండ్లకుంట, రూపెనగుంట్ల, దేచవరం
- 16వ రౌండ్‌లో.. దేచవరం, రూపెనగుంట్ల, కుంకలగుంట, పాపిశెట్టిపాలెం
- 17వ రౌండ్‌లో.. జిల్లాపేట తండా, చేజర్ల, ముప్పాళ్ళ మండలం కుందురువారిపాలెం, గోళ్ళపాడు, లంకెలకూరపాడు, నార్నెపాడు
- 18వ రౌండ్‌లో.. పలుదేవర్లపాడు, చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ, కొంకావారిపాలెం, తురకపాలెం, దమ్మాలపాడు
- 19వ రౌండ్‌లో.. దమ్మాలపాడు, బొల్లవరం, రామకృష్ణాపురం, మాదల, రుద్రవరం
- 20వ రౌండ్‌లో తొండపి, ఇరుకుపాలెం, సత్తెనపల్లి టౌన్ రంగా కాలనీలోని పోలింగ్ బూత్ ఓట్ల లెక్కింపుతో ఫలితం తేలనుంది.

నేటి నుంచి కోళ్లూరి ప్రసన్నాంజనేయుని జయంత్యుత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరి ప్రసన్నాంజనేయ స్వామి వారి జయంత్యుత్సవాలు ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మర్రి ప్రసాదరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలలో ఒకటిగా ఈ ఆలయం ఉంది. పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామమైన కోళ్లూరు నుంచి గత పది సంవత్సరాల క్రితం స్వామి వారిని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్దకు తరలించారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా స్వామి వారి కల్యాణ వేడుకలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆరు గంటలకు రామ నామ సంకీర్తనతో పూజ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని ఆలయ అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. 7 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం దీక్ష స్వాములకు ఇరుముడి కార్యక్రమం, సాయంత్రం నాలుగు గంటలకు కోలాటం, 6 గంటలకు వైఖానస శాస్త్రానుసారంగా సువర్చల సహిత ప్రసన్నాంజనేయస్వామి వారి కల్యాణ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2వ తేదీన ఉదయం సుప్రభాత సేవ, ఆకు పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం తీర్థప్రసాద వినియోగము, కోలాట కార్యక్రమాలు ఉన్నట్లు తెలిపారు. 3వ తేదీన ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యా రంగానికి జడ్ఎస్ సేవలు ఎనలేనివి



డీఐఈవో నీలావతిదేవిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్రరావు దంపతులు, అధ్యాపకులు

సత్తెనపల్లి: విద్యా రంగానికి సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జడ్ఎస్ రామచంద్రరావు ఎనలేని సేవలు అందించారని ఆర్జేడీ వి.సుబ్బారావు, డీఐఈవో ఎన్.నీలావతి దేవిలు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసిన జెడ్ఎస్ రామచంద్రరావు శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో వైస్ ప్రిన్సిపాల్ కెటీటీ వెంకటరమణ అధ్యక్షతన రామచంద్రరావు పదవీ విరమణ సభ నిర్వహించారు. ఈ సభలో వారు ముఖ్య అతిథులుగా హాజరై రామచంద్రరావు సేవలను కొనియాడారు. అనంతరం రామచంద్రరావును పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అలాగే ఆర్జేడీ వి.సుబ్బారావు, డీఐఈవో ఎన్.నీలావతి దేవిని సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కోటేశ్వరమ్మ, శివకుమారి, శైలజాకుమారి, శ్రీనివాసరావు, రవి, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు లేకుండా సేవలందించడం అభినందనీయం



ఫార్మసిస్టు దంపతులను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో, డిప్యూటీ డీఎంహెచ్‌వో, వైద్య సిబ్బంది

ముప్పాళ్ల: వైద్యశాలకు వచ్చే వారి పట్ల వైద్య సిబ్బంది ప్రేమతో మాట్లాడితే మంచి ఆదరణ లభిస్తుందని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి తెలిపారు. మండల కేంద్రంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మాసిస్టు బి.రాజ్యలక్ష్మి పదవీ విరమణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో హనుమకుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి గీతాంజలి హాజరయ్యారు. డీఎంహెచ్‌వో రవి మాట్లాడుతూ వైద్య వృత్తిలో 30 ఏళ్ల పాటు ఎలాంటి ఆరోపణలు లేకుండా సేవలందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ ప్రవీణ్, సూపర్‌వైజర్లు పీటర్‌డేమియాన్, జోస్పిన్‌రాణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడులో మరోసారి చోరీయత్నం

యడ్లపాడు: వరుసగా దొంగలు గ్రామంలో హల్‌చల్ చేయడంతో యడ్లపాడు గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. సరిగ్గా వారం రోజుల కిందట మాదిరిగానే గ్రామంలోని మరో దుకాణంలో గుర్తు తెలియని దుండగుడు చోరీకి విఫలయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ హైవే సర్వీసు రోడ్డులో ఉన్న గాండ్ల శ్రీనివాస్ సెల్ షాపు దుకాణం ఉంది. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి షాపుకు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. మర్నాడు ఉదయం షాపు తెరిచేందుకు వచ్చి చూడగా షట్టర్‌కు వేసిన తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. అనుమానంతో దుకాణంలోని సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించగా ముందురోజు రాత్రి 1.15 గంటలకు ముఖానికి మాస్క్, టీ షర్టు ధరించిన యువకుడు రాడ్డుతో వచ్చి తాళాల్ని పగులగొట్టాడు. ఇంతలోనే వాహనాలు రావడాన్ని గమనించి ఉడాయించాడు. వారం కిందట సరుకుల దుకాణంలోనూ జగడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. వరుస దొంగతనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



వెల్దుర్తి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలని స్టేట్ అబ్జర్వర్ కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న వారికి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ మెనూను రుచి, శుచితో పాటు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలన్న లక్ష్యానికనుగుణంగా అందరూ సమష్టిగా పనిచేయాలని ఆమె కోరారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించటంలో ఎండీఎం నిర్వాహకులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. వీటితో పాటు వేరుశనగ చిక్కీలు, బెల్లం రాగి జావ, తయారు చేయటంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల మిడ్ డే మీల్స్ నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించివారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీ పూర్ణ చంద్రరావు, సీఆర్‌పీలు పి.శ్రీను, వెంకయ్య, వెంకటేశ్వర్లు, ఎండీఎం సిబ్బంది తదితరులున్నారు.

27 మద్యం సీసాలు స్వాధీనం

రెంటచింతల: మండలంలోని మల్లవరం గ్రామంలో ఓ బెల్ట్‌షాపులో తనిఖీలు నిర్వహించి 27 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన షేక్ ఖాసిం బెల్ట్ షాపును నిర్వహిస్తుండగా అతని వద్ద 27 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాలలో ఎవరైనా బెల్ట్‌షాపులు నిర్వహించినా సమాచారం పోలీసులకు తెలిపాలని.. నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి



సత్తెనపల్లి: తెలుగు సినీ చిత్ర రంగంలో సూపర్ స్టార్ కృష్ణ ధైర్యసాహసాలకు ప్రతీక అని కృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు చందలూరి రంగా అన్నారు. పట్టణంలోని కార్తీక్ రెసిడెన్సీలో సూపర్ స్టార్ కృష్ణ జయంతిని కృష్ణ, మహేష్ బాబు అభిమానులు సీనియర్ న్యాయవాది మర్రి వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. న్యాయవాది సుబ్బారెడ్డి మాట్లాడుతూ సూపర్ స్టార్ కృష్ణ చిత్ర పరిశ్రమకు చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. తెలుగు చిత్ర పరిశ్రమకు మొట్టమొదటి సినిమా స్కోప్ కలర్ చిత్రాలను కృష్ణ పరిచయం చేశారన్నారు. ఏపీలో తెలుగు సినీ పరిశ్రమ నిలదొక్కుకునేందుకు కృషి చేశారన్నారు. ముందుగా కృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణ, మహేష్‌బాబు అభిమాన సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ వయసుకే కాని సేవలకు కాదు

తహసీల్దార్ ఎం.సువర్ణ



పాతూరి నాగేశ్వరరావు దంపతులకు పదవీ విరమణ సత్కారం

క్రోసూరు: నిరంతరం ప్రజల మనసెరిగి పనిచేసే వారికి పదవీ విరమణ వయసు రీత్యా ప్రభుత్వం విధుల నుంచి దిగిపోవటమే కానీ సేవలు చేసేవారికి కాదని తహసీల్దార్ ఎం.సువర్ణ అన్నారు. శుక్రవారం క్రోసూరులోని షాదీఖానాలో పులిచింతల డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ పదవీవిరమణ పొందిన పాతూరి నాగేశ్వరరావు దంపతులకు క్రోసూరు రెవెన్యూ శాఖ, మండల పరిషత్ అధికారులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ సువర్ణ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో 30 సంవత్సరాలు అనేక హోదాల్లో పని చేసిన పాతూరి నాగేశ్వరరావు శాఖ పరమైన సేవలు ప్రజలకు అందించటంలో మంచి పేరు సంపాదించుకున్నారని అన్నారు. సమయపాలన పాటిస్తూ రెవెన్యూ సమస్యలను పరిష్కరించగల సమర్థుడని అన్నారు. సీనియారిటీపై పులిచింతల డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ అయినప్పటికీ తన పూర్తి బాధ్యతలు క్రోసూరులో నిర్వహించారన్నారు. ప్రతి ఒక్కరికీ ఆయన తలలో నాలుకలాగ ఉండేవారని అన్నారు. ఆయన పదవీవిరమణ తరువాత కుటుంబసభ్యులతో శేషజీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నాగేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు డీటీ కె.శ్రీనివాసరావు, రెవెన్యూ సంఘం అధ్యక్షుడు పేరయ్య, వీఆర్వోలు, పంచాయతీ విస్తరణాధికారి శివరామయ్య, వీఆర్ఏలు, రెవెన్యూ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఠారెత్తిస్తున్న ఎండలు



నిర్మానుష్యంగా అమరావతి మెయిన్ రోడ్డు

అమరావతి: మే నెల పూర్తయిన ఎండ తీవ్రత మాత్రం పెరుగుతోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను చిన్న పిల్లలు, వృద్ధులు తట్టుకోలేక పోతున్నారు. గత నాలుగు రోజులుగా మండల పరిధిలోని గ్రామాలలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగి సుమారు 44 డిగ్రీలకు పైగా నమోదు కావటం, గాలిలేక ఉబ్బరీస్తుండటంతో ప్రజలు బయటకు రావటానికే భయపడుతున్నారు. శుక్రవారం మండల కేంద్రమైన అమరావతిలో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు తమ వ్యక్తిగత పనులను ఉదయం పది గంటలకే ముగించుకుని ఇళ్లకు వెళుతున్నారు. తప్పనిసరి అయితే తప్ప ప్రజలు ప్రయాణాలు కూడా చేయడం లేదు. మండల కేంద్రమైన అమరావతికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రతి రోజు సుమారు నాలుగైదు వేల మంది వివిధ పనులపై వచ్చి వెళుతుంటారు. ప్రస్తుత ఎండ వేడిమికి అమరావతికి వచ్చే సందర్శకుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. వైద్యులు కూడా ఎండలో తిరగవద్దు అని హెచ్చరిస్తుండటంతో ప్రజలు పెద్దగా కనిపించక రోడ్లు నిర్మానుష్యంగా తయారయ్యాయి.

మగ్గం వర్క్‌లో మహిళలకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు పొందిన వారితో యూనియన్ బ్యాంకు డైరెక్టర్ బ్రహ్మానందంకుమార్

సత్తెనపల్లి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్, యూనియన్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో మహిళల స్వయం ఉపాధికై మగ్గం వర్క్‌పై తర్ఫీదు ఇచ్చారు. 30 రోజుల పాటు ఈ తర్ఫీదు పొందిన మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. దళిత బహుజన రిసోర్స్ కోఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ బ్యాంక్ డైరెక్టర్ బ్రహ్మానందం కుమార్ మాట్లాడుతూ మహిళలు వారి కుటుంబ అభివృద్ధికి తోడ్పడే విధంగా వారి జీవనోపాధిని మెరుగుపరుచుకొని కుటుంబానికి సహాయంగా ఉండాలన్నారు. ఫ్యాకల్టీ రాజశేఖర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ సహాయంతో చిన్న చిన్న యూనిట్లు పెట్టుకొని కావలసిన మెటీరియల్స్‌కు త్వరలో బ్యాంకు ద్వారా లోన్ ఇప్పించి వారి జీవనోపాధికి తోడ్పడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మగ్గం వర్క్ నేర్చుకున్న మహిళలు పాల్గొన్నారు.

ధూమపానం మానండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి

ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్



ధూమపానంపై అవగాహన కల్పిస్తున్న శిఖా శ్యాంసన్

క్రోసూరు: ధూమపానం మానుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా క్రోసూరులోని ఎస్సీ కాలనీలో ఆయన ధూమపానంపై అవగాహన కల్పించి మాట్లాడారు. ధూమపానం నుంచి భవిష్యత్తరాలను రక్షిద్దామని పిలుపునిచ్చారు. ధూమపానం చేయడం ఫ్యాషన్‌గా తీసుకోకూడదని ఇళ్లల్లో పెద్దలు ధూమపానం చేయటం వలన ఇంట్లోని పిల్లల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపిస్తుందన్నారు. ధూమపానం వల్ల శరీర భాగాలైన గొంతు, ఊపిరితిత్తులు, మూత్రపిండాలకు క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందన్నారు. నాడీ సంబంధిత అవయవాలు పక్షవాతానికి దారితీస్తాయన్నారు. పురుషుల్లో నపుంసకత్వం, మహిళల్లో హార్మోన్ల సంఖ్య తగ్గి, రుతుక్రమం త్వరగా నిలిచిపోవటానికి ధూమపానం ప్రధాన కారణమని వైద్యులు తెలుపుతున్నారని అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పొగతాగే అలవాట్లు మానుకొనేందుకు చిట్కాలను వివరించారు. సిగరెట్టు తాగాలనిపించినప్పుడు నోట్లో చూయింగ్ గమ్, ఏదైనా స్వీటు, పిప్పర్మెంట్ లాంటివి పెట్టుకుని, లోతైన శ్వాస తీసుకోవటం అలవాటు చేసుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పొగ తాగటానికి ఆకర్షితులు కాకుండా ఉండవచ్చని తెలియజేశారు.

మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నకరికల్లు: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనాన్ని అందించేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తుందని పల్నాడు ఎండీఎం ఏడీ బి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన భోజనంతో పాటు వేరుశనగ చిక్కీలు, బెల్లం రాగిజావ తయారు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, వంట పాత్రల పరిశుభ్రత గురించి వివరించారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో–2 ఎంఎల్ఎన్ ప్రసాద్, ఎండీఎం కో ఆర్డినేటర్ ఆర్.కల్యాణ్‌రావు, స్టేట్ ఎండీఎం శిక్షకురాలు పి.విజయలక్ష్మి, ఎంఐవోఎస్ మండల కో ఆర్డినేటర్ బత్తిన మల్లిఖార్జునరావు, సీవో అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు

వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు గ్రామంలో వేంచేసియున్న వీరాంజనేయస్వామి వారి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు యండపల్లి సుబ్బారావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమజ్జయంతి సందర్భంగా స్వామి వారికి తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించటంతో పాటు అభిషేకాలు చేయనున్నట్లు తెలిపారు. స్వామి వారికి భక్తులు మొక్కుబడులు చెల్లించుకుంటారన్నారు. దేవస్థానం వారు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయటం జరుగుతుందన్నారు.